క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేపీహెచ్‌బీకాలనీ: శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రమ్యాగ్రౌండ్‌లో ఏరియా డెంటల్ చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పరీక్షలు చేయించుకుని సలహాలు, సూచనలు పొందారు. స్థానికుల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు కట్టా నరసింగ రావు, ఏరియా డెంటల్ చారిటబుల్ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ శ్వేత తెలిపారు.

సాయిబాబా దేవాలయం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఓల్డ్ బోయిన్‌పల్లి : ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్, సాయిక్రిష్ణ కాలనీలోని సాయిబాబా దేవాలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మధుమేహం, కొలెస్ట్రాల్, థైరాయిడ్ పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన వైద్యశిబిరంలో దాదాపు 300 మంది పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్యులు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయిబాబా దేవాలయం ప్రతినిధులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో చెరువు సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, దోమడుగు గ్రామానికి చెందిన దాకూరి శ్రీనివాస్(46) ప్రైవేట్ ఉద్యోగి. ప్రతి నెల కుమ్మరి సంఘం చిట్టీ డబ్బులు చెల్లించేందుకు దుండిగల్‌కు వచ్చి వెళుతుంటాడు.చిట్టీ డబ్బులు కట్టేందుకు శనివారం మధ్యాహ్నం బైక్‌పై దుండిగల్‌కు వచ్చాడు. మధ్యాహ్నం 2గంటల నుంచి అతడి భార్య ఫోన్ చేసినా స్పందించలేదు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుమారుడు పవన్ కల్యాణ్‌కు విషయం చెప్పడంతో అతను తండ్రి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించాడు. ఆదివారం ఉదయం దుండిగల్ చెరువు సమీపంలోని రాయిపై బైక్, ఫోన్, చెప్పులు కనిపించాయి. పక్కనే తల,ముఖంపై తీవ్రగాయాలతో శ్రీనివాస్ మృతి చెంది ఉన్నాడు. చిట్టి డబ్బులు చెల్లించిన అనంతరం సంఘం సభ్యులతో కలిసి శ్రీనివాస్ మద్యం తాగినట్లు సమాచారం. మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లిన అతను ప్రమాదవశాత్తు కింద పడి చనిపోయాడా.. వేరే కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

జీడిమెట్ల: భర్త కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ విలేజ్‌కు చెందిన ఎర్రోళ్ల గాయత్రి(26) వెంకటేష్ పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కాగా గత కొద్ది రోజులుగా వెంకటేష్ కుటుంబాన్ని పట్టించుకోకుండా జులాయిగా తిరుగుతున్నాడు. భర్త తన తీరు మార్చుకోవాలని గాయత్రి పలుమార్లు అతడిని కోరింది. అయినా వెంకటేష్ వైఖరిలో మార్పురాకపోవడంతో మనస్తాపానికిలోనైన గాయత్రి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించండి

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బంజారా సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సంఘం సభ్యులు ఆదివారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిజాంపేట్ బంజారా సేవా సంఘ్ అధ్యక్షుడు రాములు నాయక్, ఉపాధ్యక్షుడు రామచంద్రనాయక్, రవీందర్, పరమేశ్, పాండు, రవి, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాక్ లైటింగ్.. వాకింగ్ ట్రాక్..

- సమతానగర్ పార్క్‌లో అత్యాధునిక సౌకర్యాలు
- సుందరీకరణ పనులకు శ్రీకారం
- రూ.1.80 కోట్లతో పనులు ప్రారంభం
- కాలనీలో ప్రత్యేక ఆకర్షణ





సుందరీకరణకు నోచుకోనున్న సమతానగర్ పార్కు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్ పార్కు గత కొన్నేళ్లుగా పూర్తి నిరాదరణకు గురైంది. ఒకప్పుడు రాళ్లు, ముళ్లపొదలు దర్శనమిచ్చేవి. వాకర్స్ వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్ తప్ప ఎటువంటి సౌకర్యాలు ఉండేవి కావు. పార్కులను సుందరీకరించి పచ్చదనానికి ప్రతీకగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఇటీవల పార్కు సుందరీకరణ కోసం 1.80 కోట్లు నిధులు మంజూరు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కొద్ది రోజుల క్రితమే పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి సుందరీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పార్కులో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పిచ్చిమొక్కలను తీసి వేశారు. కొన్ని బండరాళ్లను తొలగించగా, మరికొన్ని బండరాళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. పార్కు సుందరీకరణ పనులు పూర్తయితే పరిసర కాలనీల వాసులకు ఎంతో ఉపయోగకరం కానుంది. దీనికి తోడు చిన్నారుల కోసం పార్కులో ప్రత్యేక ఆట పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా రాక్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో ఫౌంటైన్, రాక్ లైటింగ్స్, వాకింగ్ ట్రాక్, యోగా క్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నారు. పార్కుల్లో మెరుగైన వసతులను కల్పించి పచ్చదనం పెంపొందించేందుకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇప్పటికే సమతానగర్ కాలనీలోని మరో పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ప్రధానంగా పార్కులు, చెరువులను సుందరీకరించి ఆయా ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయలు పార్కులతో పాటు చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సమతానగర్ పార్కు దుస్థితిపై కాలనీ వాసులు, ప్రజా ప్రతినిధులు పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పార్కును సుందరీకరించేందుకు నిధులు కేటాయించారు. వీలైనంత త్వరలో పార్కు సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.



ఎమ్మెల్యే చొరవతోనే..

పార్కులను సుందరీకరించి పచ్చదనానికి ప్రతీకలుగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోని పార్కులను అభివృద్ధి చేసి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాము. సమతానగర్ పార్కు ఒకప్పుడు అధ్వానంగా ఉండేది. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చొరవతో పార్కు అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించాము. ఈ పార్కులో అన్ని వసతులను కల్పించి ప్రజలను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతున్నాము. పార్కులో ఏర్పాటు చేయనున్న యోగా సెంటర్, రాక్ గార్డెన్, వాటర్ ఫౌంటైన్, వాకింగ్ ట్రాక్, రోప్ వంతెన ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

–నార్నే శ్రీనివాసరావు, హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్

ఘనంగా ఎర్రపోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ



కార్యక్రమంలో పాల్గొన్న వద్దేపల్లి రాజేశ్వరరావు, రవికుమార్ యాదవ్ తదితరులు

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ వెస్ట్ సాయినగర్‌లోని శ్రీ ఎర్ర పోచమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గత మూడు రోజులుగా యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం కమిటీ అధ్యక్షుడు గుండడి ప్రభాకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గజ్జల యోగానంద్, వద్దేపల్లి రాజేశ్వరరావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఎం. రవికుమార్ యాదవ్, పన్నాల హరీష్‌రెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, సురభి రవీంద్రరావు, వెస్ట్ సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోచారం శివరాజు గౌడ్, అల్లూరి రామరాజు, రాజేష్ చంద్ర, సిహెచ్. రఘు, ఆకుశెట్టి సుబ్బారావు, శ్రీధర్‌రావు, జి. ఉమామహేశ్వర్ , కాలనీ వాసులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం



బిఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రంగరాయ ప్రసాద్

నిజాంపేట్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శమని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. ఆదివారం నిజాంపేట్‌లోని 11వ వార్డులో కార్పొరేటర్ రవికిరణ్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగరాయ ప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పటిష్టత కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు అందరు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్ యాదవ్, రామక్రిష్ణ ,రాజేశ్ వర్మ, బొట్టు శ్రీనివాస్ రావు, మంజునాథ్, శేషగిరి, సుధీర్‌వర్మ, దశరథ్, నరేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మహిళా కార్మికులకు సన్మానిస్తున్న కృష్ణ తదితరులు

బాలానగర్: సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది, మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై నానాటికి అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో చారి, చంద్రమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం...



పనులను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ బాబూరావు తదితరులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ రోడ్డు నెంబర్ 9లో చాలా కాలంగా ప్రజలు మంచినీటి సరఫరాలో లోప్రెషర్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో కార్పొరేటర్ పగుడాల శిరీష సమస్యను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ నిధులు మంజూరు చేశారు. ఆదివారం మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబూరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భూమండ్ల అశోక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఫన్ స్కూల్ వార్షికోత్సవం



మోతీనగర్: మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురి కాలనీలోని ఫన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పాఠశాల చిన్నారులే ముఖ్య అతిథులుగా హాజరుకావడం విశేషం. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ మాధ్యూ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే చదువుతో పాటు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్

గచ్చిబౌలి: విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్ హుషారుగా సాగింది. మారుతి సుజుకి ప్రీమియం నెక్సా యొక్క గ్రాండ్ విటారా ఎక్స్‌పీరియన్స్ డ్రైవ్‌ను నగరంలో ఆదివారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో సరికొత్త గ్రాండ్ విటారా కారు సామర్థ్యాన్ని ఎక్స్‌పీరియన్స్ ఆఫ్ రోడ్ డ్రైవర్స్ బృందం కష్టమర్లకు నడిపి చూపించారు. ఏడు రకాలైన అత్యంత కఠినమైన దారులలో కష్టమర్లు నడిపారు. దీంతో 100 బుకింగ్‌లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

హైటెక్స్‌లో ఐ-రన్



మాదాపూర్: బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో-2023లో భాగంగా మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఆదివారం ఐ- రన్ పేరిట మహిళల రన్‌ను నిర్వహించారు. నిర్వాహకుడు శామ్యూల్ సుధాకర్ మాట్లాడుతూ మహిళలు బిడియం , కంపెనీ లేకపోవడంతో ఎవరితో కలసి పరిగెత్తాలి, ఇంటి బాధ్యతలు.. ఈ మూడు కారణాల వల్ల పరుగులో పాల్గొనరని తెలిపారు. ఈ అడ్డంకులను ఛేదించేందుకే తొలిసారిగా మహిళలతో రన్‌ను నిర్వహించినట్టు తెలిపారు. అన్ని వయస్సుల వారికి ఐరన్ బ్రేకింగ్ బారియర్స్ అనే ప్రత్యేకమైన థీమ్‌తో నిర్వహించినట్టు తెలిపారు. 14 సంవత్సరాల నుండి 76 సంవత్సరాల లోపు మహిళలు రన్‌లో పాల్గొన్నట్టు తెలిపారు.

అంతర్జాతీయ న్యూస్ పోర్టల్ ప్రారంభం

మాదాపూర్: ప్రపంచ వ్యాప్తంగా టాప్ 12 దేశాలకు సంబంధించిన బిజినెస్ వార్తలు, ఇంటర్వ్యూస్, అందించేందుకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మాదాపూర్‌లో న్యూస్ పోర్టల్‌ను ఆదివారం ఫౌండర్ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంటర్‌ప్రెన్యూర్స్ విజయ్‌పాల్ రెడ్డి, డాక్టర్ షేక్ నమతుల్లా భాషా, న్యూస్ వాచ్ ఎడిటర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ పాంక్రియాటిక్ సర్జరీపై నేషనల్ కాన్ఫరెన్స్

మాదాపూర్: ప్రతి సంవత్సరం దాదాపు 1.4 మిలియన్ల మంది పాంక్రియాటిక్ క్యాన్సర్ బారిన పడుతున్నారని యశోద గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి తెలిపారు. మాదాపూర్ హైటెక్‌సిటీ యశోద హాస్పిటల్‌లో అత్యంత అధునాతన రోబోటిక్ పాంక్రియాటిక్ సర్జరీపై నేషనల్ కాన్ఫరెన్స్ లైవ్ వర్క్‌షాపును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగనిర్ధారణ తరువాత 10శాతం కంటే తక్కువ మంది రోగులు ఐదు సంవత్సరాలు మాత్రమే జీవిస్తున్నారని తెలిపారు. పొగాకు, ధూమపానం, అధిక ఆల్కహాల్, ఊబకాయం , జీవనశైలి క్యాన్సర్‌కు కారణమన్నారు. 50 సంవత్సరాల లోపు పురుషులు ఈ క్యాన్సర్ బారిన ఎక్కువ పడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి 500 మందికి పైగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



వీధి కుక్కలను పట్టుకుంటున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

వీధి కుక్కల సమస్య పరిష్కారానికి కృషి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, నవజీవన్‌నగర్‌లో శని, ఆదివారాల్లో ఓ వీధి కుక్క చెలరేగిపోయింది. దాదాపు 16 మందిని గాయపరిచింది. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసి వెటర్నరీ ఆఫీసర్ డా. లింగస్వామితో సమావేశమై కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా డా. లింగస్వామి కుక్క కరచిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాధితులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు కాలనీల్లో పర్యటించి వీధి కుక్కల సమస్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వీధి కుక్కలపై సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆదివారం జీహెచ్‌ఎంసీ ప్రత్యేక బృందాలు పలు కాలనీల్లో పర్యటించి సుమారు 15 వీధి కుక్కలను పట్టుకున్నాయి. ప్రభుత్వ పిహెచ్‌సి వైద్యుడు చందర్‌తో మాట్లాడి కుక్క కాటుకు కావాల్సిన వైద్య సదుపాయాలు, ఇంజక్షన్లు నిల్వ ఉంచుకోవాలని కార్పొరేటర్ సూచించారు.

కళాసిల్క్ హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన



కళాసిల్క్ హస్తకళా ప్రదర్శనలో కొనుగోలుదారులు

మోతీనగర్: కాలానుగుణంగా వస్త్రాలు ధరించాలని కళాసిల్క్ హస్తకళా ప్రదర్శన నిర్వాహకులు సంజయ్ జైన్, వినోద్ అన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి వస్తువుపై 60 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందన్నారు. వెంకటగిరి, మంగళగిరి, కళంకారి, ఉప్పాడ తదితర చీరలు, గృహోపకరణాలు, కొండపల్లి బొమ్మలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ మేళా ఉగాది పండుగ వరకు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మోతీనగర్ పరిసర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ శివాలయం వద్ద రూ. 27 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, నరసింహా రెడ్డి, బాబ్జి, సూర్యవంశీ, లక్ష్మణ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్‌నిర్మాణానికి విరాళం

మోతీనగర్: ఆలయాల పునర్నిర్మాణానికి ధన, వస్తు రూపేణా సహాయ సహకారాలు అందిస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని శ్రీ శివరామాంజనేయ ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ సేవకుడు రమేష్ అయ్యంగార్ అన్నారు. ఆదివారం సుంకరి క్రాంతి కిరణ్ తన తండ్రి స్వర్గీయ వెంకట్రావు పేరిట రూ.50011 విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్ అయ్యంగార్ మాట్లాడుతూ భక్తులు, స్థానికులు, దాతల సహాయ సహకారాలతో ఆలయ పునర్‌నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. మే 10 నుంచి 14 వరకు ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



దాత క్రాంతి కిరణ్‌కు రసీదు అందజేస్తున్న రమేష్

కమనీయం..భ్రమరాంబికా మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు



కార్పొరేటర్ మహేందర్, బీజేపీ నాయకులు మాధవరం కాంతారావు, పన్నాల హరీష్ రెడ్డి

మూసాపేట: మూసాపేట యాదవ్ బస్తీలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మహేందర్, మాజీ కార్పొరేటర్‌లు తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావు, బీజేపీ సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, పన్నాల హరీష్ చంద్రా రెడ్డి, వద్దేపల్లి రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు చున్నూ పాష, ఆలయ కమిటి చైర్మన్ కుమార్ యాదవ్, వైస్ చైర్మన్ ఏశ్లేష్ యాదవ్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం..అభివృద్ధే లక్ష్యం



మాదాపూర్ డివిజన్‌లో మహిళల సమస్యలను వింటున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఆదివారం మాదాపూర్‌లోని సాయినగర్, హరిజనబస్తీ, గుట్టల బేగంపేట్, నవ భారత్‌నగర్, చంద్రానాయక్‌తండాలో ఎంపీ రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తోపాటు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి సంతులిత, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. అసంపూర్తి పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. నగరంలోనే శేరిలింగంపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో విశేష ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

బీఆర్‌ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు తెలంగాణలో తిరుగులేదని ఎమ్మెల్యే గాంధీ,ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మాదాపూర్ డివిజన్‌కు చెందిన 200 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎంపీ, ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే నెహ్రూనగర్‌లో కాంగ్రెస్, బీజేపీ ఖాళీ అయిందని, భవిష్యత్తులో అన్ని కాలనీలు, బస్తీలలో ఇలాంటి పరిస్థితే నెలకొంటుందన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.